చైతన్యరథం



# ఇక పవర్ పంచ్ పోలీసింగ్!

- తప్పుచేస్తే తాటతీస్తారన్న భయముండాలి
- అలాగే.. పోలీసు అలసత్వాన్నీ సహించేది లేదు
- శాంతి భద్రతల విషయంలో 'నో కాంప్రమైజ్'
- అఘాయిత్యాలకు పాల్పడితే.. అదే వాళ్ల చివరి రోజు
- ఏపీ పోలీస్ ప్రతిష్టను మళ్లీ సాధించుకుందాం..
- విచారణలో ఆలస్యమైతే.. నేనే ఘటనా స్థలికెళ్తా
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరించండి
- గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలి..
- ప్రజల భద్రతకు పోలీస్ భరోసానివ్వాలి..
- హోంశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర పోలీసింగ్‌లో స్పష్టమైన మార్పు కనిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నేరాలకు పాల్పడితే శిక్ష తప్పదన్న భయం కలిగేలే పోలీసు శాఖ పనిచేయాలన్నారు. నేరస్తులను పట్టుకోవడం, శిక్షించడంతోపాటు... అసలు నేరం చేయాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాలన్నారు. ప్రజా భద్రతకు భరోసా ఇచ్చేలా పోలీసు పనితీరు ఉండాలంటూ.. పూర్తిస్థాయి శాంతిభద్రతలతో మళ్లీ ప్రశాంతమైన రాష్ట్రంగా ఏపీ కనిపించాలని సీఎం ఆదేశించారు. రాజకీయ ముసుగులో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో, నేరాల విచారణ, నేరస్తులకు శిక్షల విషయంలో అధికారులు ఫలితాలు కనిపించేలా పనిచేయాలని సూచించారు. హోంశాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సమీక్షించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారాకా తిరుమలరావుతో పాటు పోలీసు శాఖలోని ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు.

### గత ప్రభుత్వంలో 46 శాతం పెరిగిన నేరాలు

సచివాలయంలో జరిగిన సమీక్షలో గత పదేళ్లలో పోలీసు శాఖ పరిస్థితిని అధికారులు వివరించారు. 2014-19తో పోల్చితే 2019-24లో క్రైంరేట్ 46 శాతం పెరిగిందని వివరించారు. 2014-19తో పోల్చుకుంటే 2019-23 మధ్యకాలంలో మహిళలపై నేరాలు 35.91 శాతం, మహిళల అదృశ్యం కేసులు 84.83 శాతం, సైబర్ నేరాలు 134.43 శాతం పెరిగాయన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ కేసులు 107.89 శాతం, చిన్న పిల్లలపై నేరాలు 151.88 శాతం పెరిగాయని వెల్లడించారు. గత ప్రభుత్వ తీరుతో పోలీసు శాఖ ఎలా నిర్వీర్యమైందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీసు శాఖలో ఆయా విభాగాలకు ఇవ్వాల్సిన చిన్న చిన్న ఆర్థిక మొత్తాలను కూడా చెల్లించకపోవడం వల్ల పోలీసులు, పోలీసు శాఖ ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

### పరికరాల ఏఎంసీకి దిక్కులేదు... కాలం చెల్లిన వాహనాలు

పోలీసు శాఖ వద్ద 143 డ్రోన్లు ఉంటే అందులో 88 పనిచేస్తున్నాయని తెలిపారు. బాడీ వోర్న్ కెమేరాలు 1250 ఉంటే 444 మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంలో 1180 కెమేరాలకుగాను కేవలం 317 మాత్రమే పనిచేస్తున్నాయని, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 14,712 సీసీ కెమేరాల్లో 2371 కెమేరాలు పనిచేయడం లేదని వివరించారు. ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం కూడా పనిచేయడం లేదని తెలిపారు. వీటన్నింటినీ తిరిగి వాడుకలోకి తెచ్చేందుకు అవసరమైన రూ.30 కోట్లు నిధులు కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. యాన్యువల్ మెయింటనెన్స్ ఛార్జీలు చెల్లించకపోవడం వల్ల చాలా సేవలు అందుబాటులో లేకుండా పోయాయని.... వీటివల్ల నేర విచారణలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. పోలీసు విభాగంలో 2014-19 మధ్య 5215 వాహనాల కొనుగోలుకు రూ.221.8 కోట్లు ఖర్చు చేస్తే.. వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.67.3 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కాలం చెల్లిన వాహనాలతో పోలీసు శాఖ ఇబ్బంది పడుతోందని... ప్రస్తుతం 2812 వాహనాల కోసం రూ.281 కోట్లు బడ్జెట్ అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### నిధుల విడుదలకు సీఎం అంగీకారం

ముఖ్యమంత్రి మాట్లాడుతూ పోలీసు శాఖను మళ్లీ గాడిలో పెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా వ్యవస్థల్లో పరికరాల నిర్వహణ ఖర్చులకు ఎప్పటి నుంచో పెండింగులో ఉన్న రూ.10 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సీసీ కెమేరాల ఏర్పాటులో పెండింగులో ఉన్న రూ.11 కోట్ల బిల్లులు కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పోలీస్ శాఖను ఆధునికీకరించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవాటాగా రూ.61 కోట్లు విడుదల చేయడానికి సీఎం ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వం పోలీసులను కక్ష సాధింపులకు, ప్రజల, రాజకీయ పార్టీల అణిచివేతకు ఉపయోగించుకుంది కానీ.....పోలీసు శాఖ సామర్థ్యం మాత్రం పెంచేలేదన్నారు. నేర పరిశోధనలో కీలకమైన ఫింగర్ ప్రింట్‌వంటి విభాగాలకు, పరికరాలకు కనీసం రూ.10 కోట్లు యాన్యువల్ మెయింటనెన్స్ చార్జెస్ చెల్లించకపోవడంపై ముఖ్యమంత్రి విస్మయం వ్యక్తం చేశారు. పోలీసు శాఖను మళ్లీ గాడిన పెదతామని..... రాష్ట్రస్థాయి అధికారుల నుంచి కింద పనిచేసే ఎస్‌ఐ వరకు మార్పు కనిపించాలని సీఎం స్పష్టం చేశారు. మహిళలపై హింస విషయంలో చాలా కఠినంగా ఉండాలి. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అనేది నేరస్తులకు అర్థం కావాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో గంజాయి సాగు, సరఫరా, వాడకం విపరీతంగా పెరిగిందని.. డ్రోన్స్‌ను వినియోగించి గంజాయి పంట ఎక్కడ ఉందో గుర్తించి నాశనం చేయాలన్నారు. రాష్ట్రంలో, గంజాయి డ్రగ్స్ అనే మాట వినిపించకూడదన్నారు. గంజాయి రహిత రాష్ట్రం కోసం ఉత్పత్తి, సరఫరా, వాడకం మధ్య ఉన్న చైన్ తెంచడం ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెలలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీలు చేద్దామని... ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానని సీఎం అన్నారు. గంజాయి విషయంలో ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరముందని సీఎం అన్నారు. నేరాల విచారణ విషయంలో అసలత్వాన్ని, ఆలస్యాన్ని సహించేది లేదని.. నేరం జరిగిన వెంటనే క్లూస్‌టీం, ఫోరెన్సిక్ బృందాలు ఎందుకు వెళ్లడం లేదని సీఎం ప్రశ్నించారు. ఇకపై పరిస్థితి మారాలన్నారు. నేరం జరిగిన చోట వేగంగా పోలీసులు స్పందించకపోతే... తానే స్వయంగా కొన్ని ఘటనలకు వెళ్లి విచారణను పర్యవేక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు.

### సైబర్ క్రైంపై అవసరమైతే కొత్తచట్టం

సైబర్ క్రైంను ఎదుర్కోవడానికి నిపుణులతో చర్చించాలని... అవసరమైతే కొత్త చట్టాలు తీసుకొద్దామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్ స్టేషన్ పెట్టాలన్నారు. ఇన్వెస్టిగేషన్ చార్జెస్ కింద కొంత మొత్తం విచారణ అధకారులకు ఇచ్చే విధానాన్ని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించారని.... ఇప్పుడు దాన్ని మళ్లీ పునరుద్ధరించాలని అధికారులు కోరగా దానికి సీఎం అంగీకరించారు. వీటితోపాటు గ్రేహౌండ్స్ సెంటర్, ఏపి పోలీసు అకాడమీ, ఏపి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌సెంటర్,ఎపి ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్ ఏర్పాటుస్థితిగతులను అధికారులు వివరించారు. కేంద్ర నుంచి వీటికి రావాల్సిన నిధులు తెచ్చుకుని వెంటనే పనులు మొదలు పెట్టాలని సీఎం అదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో విషయంలో ఏం చర్యలు తీసుకుంటున్నారు అనే ప్రణాళికతో రావాలని సీఎం ఆదేశించారు.వాహనాల ఫిట్ నెస్ విషయంలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ విషయంలో వాహనదారులను వేధించినట్లు కాకుండా..ప్రజల రక్షణకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అయ్యే వారిని వదిలిపెట్టవద్దని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగా ఉండాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### విపత్తు నిర్వహణ శాఖనూ నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

విపత్తు నిర్వహణ సంస్థకు తన వాటాగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 25 శాతం నిధులు ఇవ్వక పోగా.. కేంద్రంనుంచి వచ్చిన నిధులనూ డైవర్ట్ చేశారని అధికారులు వివరించారు. దీనిపై సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ఒకరకంగా నేరమన్నారు. భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే సందర్భాల్లో ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ పనితీరును అధికారులు సీఎంకు వివరించారు. నాటి తెలుగు దేశం హయాంలో ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో విపత్తులు వచ్చిన సమయంలో వెంటనే సంబంధిత శాఖలు సమన్వయంతో కేంద్రానికి నివేదికలు ఇవ్వాలని...తద్వారా కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ప్రజలకు సాయం చెయ్యవచ్చని సీఎం అన్నారు.

చైతన్యరథం

# ఆర్టీసీలోనూ ఈవీలు!

- ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచాలి
- సాధ్యాసాధ్యాలపై పూర్తిస్థాయి దృష్టిపెట్టండి
- కాలం చెల్లిన బస్సుల స్థానే కొత్త బస్సులు
- పకడ్బంధీగా మహిళలకు ఉచిత బస్సు పథకం
- రవాణా శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. డీజిల్ బస్సులు, ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుతోపాటు నిర్వహణ, మైలేజ్‌లో ఉన్న వ్యత్యాసాన్ని లెక్కించాలన్నారు.ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీలోనూ ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలులో కేంద్రం ఇస్తున్న సబ్సిడీలను వినియోగించుకుని 1253 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోవాలని సూచించారు. దూర ప్రాంతాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడిపితే ఛార్జింగ్ విషయంలో తలెత్తే సమస్యలకు పరిష్కారాలు ఆలోచించాలని అధికారులకు సూచించారు. బస్సులు అద్దెకు తీసుకునే విధానం వల్ల లాభనష్టాలు, సొంతంగా బస్సులు కొనుగోలు చేయడంవల్ల కలిగే ఉపయోగాలపై పూర్తిస్థాయి నివేదికతో రావాలని సీఎం సూచించారు. గత ప్రభుత్వం కొత్తగా బస్సుల కొనుగోలు చేయలేదని, 15 లక్షల కి.మీ కంటే ఎక్కువ తిరిగిన బస్సులు కూడా ప్రస్తుతం సర్వీసులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ కారణంగానే బస్సులకు బ్రేక్ డౌన్ సమస్యలు తలెత్తి, ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.... గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు తగ్గించిందని, తిరిగి సర్వీసుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. క్రమంగా డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సుల వైపు ఆర్టీసీ వెళ్లాలని సూచించారు. ఆర్టీసీ కార్గో ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ విధానాలను సమర్ధవంతంగా నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన 1489 డీజిల్ బస్సులను కూడా సమకూర్చుకోవాలని సీఎం అన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది తప్ప, ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రమాదాల నివారణకు ఎస్పీ, కలెక్టర్, రోడ్ సేఫ్టీ అధికారులు సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్స్ గుర్తించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను తొలగించాలని ఆదేశించారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రతి జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ కార్డు అందించాలన్నారు.

### ఉచిత బస్సు పథకంపై సమీక్ష

ఎన్నికల ముందు ఇచ్చినహామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకంపై అధికారులతో సీఎం చర్చించారు. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఢిల్లీ, కర్నాటక, పంజాబ్, తమిళనాడుతోపాటు ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధికారులు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలన్నారు. ఈమేరకు అధికారుల బృందం ఆయా రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. రెండు రోజులు ఆలస్యమైనా లోపాలకు తావు లేకుండా, మహిళలు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేలా విధానాలు రూపొందించాలన్నారు.


## రోడ్లు, డ్రైనేజీ నిర్వహణపట్ల అప్రమత్తం: మంత్రి జనార్ధన్ రెడ్డి



బనగానపల్లె (చైతన్య రథం): బనగానపల్లె రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సంబంధిత మున్సిపల్, అర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కరెంట్ ఆఫీస్ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ పరిస్థితులను బుధవారం నేరుగా వెళ్లి పరిశీలించారు. అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ భ్రష్టుపట్టిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు గత పాలనలో గుంతల రోడ్లు, రోడ్లపై పారే డ్రైనేజీ వ్యవస్థలతో అనేక ఇబ్బందులు పడ్డారని అధికారులకు గుర్తు చేశారు. బనగానపల్లె పట్టణంలో గతంలో ఉన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జగన్మోహన్ రెడ్డి వస్తున్నాడంటూ హడావుడిగా నాణ్యతలేని రోడ్లు వేశాడని వ్యాఖ్యానించారు. ఈ రోడ్లు చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. గత పాలకులు చేసిన తప్పులను ప్రజా ప్రభుత్వంలో అధికారులు చేస్తే తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్షణమే పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడిక తీసి పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్లు మరియు భవనాలు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్వహణపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇకపై రోడ్లు, భవనాలు, పారిశుధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీలుంటాయని, అధికారులు ప్రజాసేవపై దృష్టిపెట్టి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి డీఈ, పట్టణ మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

## అచ్యుతాపురం ఘటనపై విచారణకు సీఎం ఆదేశం

- ప్రమాదం తీవ్రంగా కలిచివేసిందన్న చంద్రబాబు
- ప్రతిఒక్కరినీ ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం
- క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా
- ఫార్మా కంపెనీ స్పందన సరిగా లేదన్న అధికారులు
- ప్లాంట్ నిర్వహణ, నిర్మాణాల్లో లోపాలపై సమాచారం



అమరావతి(చైతన్యరథం): అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాద ఘటనపై అనకాపల్లి జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులతో సీఎం చంద్రబాబు బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. అన్ని విభాగాల వైద్యులను అందుబాటులో ఉంచి బాధితుల ప్రాణాలు కాపాడాలని సూచించారు. ఇప్పటివరకు 17 మంది చనిపోయారని వివరించిన అధికారులు... కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. ప్రమాదానికి కారణాలు ఏమిటనే విషయంలో ప్రాథమిక సమాచారాన్ని సీఎంకు వివరించారు. ప్లాంట్ నిర్వహణలో మానవ తప్పిదం, ప్లాంట్ నిర్మాణంలో లోపాలపై ప్రాథమిక సమాచారాన్ని వివరించారు. ప్రమాదం అనంతరం ఫార్మా కంపెనీ యాజమాన్యం స్పందన సరిగా లేదని తెలిపారు. వివరాలు తెలుసుకున్న చంద్రబాబు ముందు బాధితుల ప్రాణాలు కాపాడడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంతమంది ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్క బాధితుడిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.

## ఉచిత ఇసుక విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష

- బుకింగ్ కోసం ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుకు ఆదేశం
- ప్రతిరోజూ నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లకు సూచనలు
- ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ, ఈ మెయిల్ ఏర్పాటు
- రవాణా చార్జీలు భారం కాకూడదని స్పష్టం

అమరావతి(చైతన్యరథం): సచివాలయంలో బుధవారం ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. ఉచిత ఇసుక రవాణాపై పలు కీల క నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతిరోజూ ఇసుక సరఫరా జరుగుతున్న తీరును పర్యవేక్షి స్తానని సీఎం స్పష్టం చేశారు. ఇసుక బుకింగ్ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇసుక సరఫరాలో ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-4599, ఈ మెయిల్ ఐడీ: డీఎంజీఏపీశాండ్స్.యాహూ.కామ్ ఏర్పాటు చేశారు. ఐవీఆర్ఎస్ విధానం ద్వారా ఇసుక సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై ప్రతిరోజూ ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించారు. ఇసుక రవాణా చార్జీలను నోటిఫై చేయాలని అధికారులకు సూచించారు. ఉచిత ఇసుక సరఫరాపై ప్రతిరోజూ జిల్లా కలెక్టర్లు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను కట్టడి చేసే బాధ్యత కలెక్టర్లదేనని తేల్చిచెప్పారు. ఇసుక బుకింగ్, రవాణా వ్యవస్థలను మరింత సులభతరం చేసేలా ప్రణాళి కలు సిద్ధం చేయాలని, స్టాక్ పాయింట్ల వద్ద రద్దీని నివారించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుకింగ్ ఇన్వాయిస్ లేకుండా లారీలు స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్లకుండా కట్టడి చేయాలని తెలిపారు. బుకింగ్ ఇన్వాయిస్‌ల తనిఖీ కోసం స్టాక్ పాయింట్ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రవాణా చార్జీలు వినియోగదారుడికి భారం కాకుం డా చూడాలని స్పష్టం చేశారు. నోటిఫై చేసిన ఇసుకను రవాణా ధరల కంటే ఎక్కువ వసూ లు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కంపెనీల్లో ప్రమాదాలు

- థర్డ్ పార్టీ ఏజెన్సీలతో భద్రతా ప్రమాణాలు లోపించాయి
- అనకాపల్లి సెజ్ బాధితులకు తక్షణ సహాయక చర్యలు
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్




అమరావతి(చైతన్యరథం): గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన థర్డ్ పార్టీ ఏజెన్సీ విధానం కారణంగానే కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు సన్నగిల్లి ప్రమాదాలకు దారితీస్తున్నాయని రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు, బాయిలర్స్, బీమా వైద్యసేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. బుధవారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో రియాక్టర్ పేలుడు ఘటనపై రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రియాక్టర్ పేలిన ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ సహాయక చర్యల్లో భాగంగా దగ్గరలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుప త్రుల్లో చికిత్స అంద జేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో థర్డ్ పార్టీ ఏజెన్సీ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పూర్తిగా సన్నగిల్లాయన్నారు. కార్మికశాఖ పూర్తిస్థాయిలో నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. విశాఖపట్నంలో దళారీ వ్యవస్థ ఎక్కువ గా ఉందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్వహణ కూడా పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేయడం జరిగిందని, కేంద్ర నిధులను కూడా సక్రమంగా వినియోగించుకోలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన రాయితీలు, సంక్షేమ పథకాలను నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఈ సమస్యలను సరిదిద్దేందుకు అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహిస్తూ కార్మిక శాఖలో మార్పు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్టు వివరించారు.

చైతన్యరథం



# మీ నైపుణ్యం అమోఘం

## కన్నయ్యనాయుడుకి సీఎం చంద్రబాబు అభినందన

అమరావతి (చైతన్య రథం): ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారి కన్నయ్య నాయుడుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బుధవారం సన్మానించారు. వెలగపూడి సచివాలయంలో కన్నయ్యనాయుడుకి శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు. వరద పోటుతో ఇటీవల తుంగభద్ర జలాశయ 19వ గేటు కొట్టుకపోయింది. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు సమస్యను పరిష్కరించేందుకు కన్నయ్యనాయుడికి ఫోన్ చేసి అక్కడకు వెళ్లాలని కోరారు. పరిస్థితిని గాడిన పెట్టేందుకు ఎంతో శ్రమించిన కన్నయ్య నాయుడు వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలోనే ఏపీ, కర్నాటక అధికారుల సహకారంతో స్టాప్ లాగ్ గేటు విజయవంతంగా అమర్చారు. దీంతో సుమారు 30 టీఎంసీ నీరు వృథా కాకుండా అడ్డుకోగలిగారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం కన్నయ్య నాయుడిని ప్రత్యేకంగా పిలిపించుకుని మాట్లాడారు. ప్రాజెక్టులో నీరు ఉండగానే స్టాప్ లాక్ గేటు అమర్చి నీరు వృథా కాకుండా రైతాంగానికి ఎంతో మేలు చేశారని ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రైతాంగం తరపున కన్నయ్య నాయుడుకి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయ కక్షలకు

# కోర్టును వేదిక చేసుకోవద్దు

- ఆధార రహిత అంశాలపై కోర్టుతో ఆడుకోవద్దు
- మాజీ ఎమ్మెల్యే ఆర్కేపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఓటుకు నోటు కేసులో రెండు పిటిషన్లు కొట్టివేత



ఢిల్లీ: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురయింది. ఓటుకు నోటు కేసులో అళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబుని నిందితుడిగా చేర్చాలని, ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ అళ్ల రామకృష్ణారెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసులో ఇప్పటికే రెండు ఛార్జిషీట్లు దాఖలయ్యాయని, జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలు లేవని పేర్కొంటూ రెండు పిటీషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వాదనల సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టులను వేదిక చేసుకోవద్దని పిటిషనర్‌ను హెచ్చరించింది. ఆధార రహిత అంశాలను తీసుకొచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్‌కు రాజకీయాలతో ఉన్న అనుబంధంపై ఆరా తీసింది. పిటిషనర్ 2014 నుంచి ఇటీవల ఎన్నికల వరకు ఎమ్మెల్యేగా ఉన్నారని చంద్రబాబు తరపు న్యాయవాదులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ ప్రతిపక్షంలో ఉందని, పిటిషన్ దాఖలు చేసిన సమయంలో కూడా ప్రతిపక్షంలోనే ఉందని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వివరించారు. దీనిపై స్పందిస్తూ కావాలంటే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని ఆర్కేకు ధర్మాసనం సూచించింది. ఓటుకు నోటు వ్యవహారంపై సుప్రీంకోర్టులో వేరే కేసులు కూడా ఉన్నాయని రామకృష్ణారెడ్డి తరఫు న్యాయవాది జాబితా ఇచ్చారు. ఆ కేసులకు, ఇప్పుడు వాదనలు జరుగుతున్న కేసులకు సంబంధం లేదని లూథ్రా తెలిపారు. కేసుల జాబితా చూశాక.. పిటీషనర్‌పై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది.

# పెట్టుబడులు! ఉపాధి కల్పన!!

- ◆ వికసిత్ ఆంధ్ర సాధనకు ప్రభుత్వ ప్రాధాన్యతలు
- ◆ త్వరలో ది బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీ తెస్తున్నాం
- ◆ పాలసీ రూపకల్పనలో సలహాలు, సూచనల స్వీకరణ
- ◆ పారిశ్రామికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు
- ◆ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తగు ప్రోత్సాహం
- ◆ సమర్థవంతంగా సింగిల్ విండో పాలసీ అమలు
- ◆ యువతలో ఉపాధి నైపుణ్యాలు పెంచేలా కరికులమ్
- ◆ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా శిక్షణకు చర్యలు
- ◆ ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి



అమరావతి (చైతన్య రథం): వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ పాలసీ రూపొందించనున్నట్టు రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. నూతన ఇండస్ట్రీ పాలసీ రూపకల్పనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ, సీఐఐ సంయుక్త ఆధ్వర్యంలో స్టేక్ హెూల్డర్స్ సమావేశం విజయవాడలో బుధవారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ వర్చువల్‌గా తన సందేశాన్ని అందించారు. స్టేక్‌హెూల్డర్స్ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తుండటం శుభసూచకమన్నారు. పారిశ్రామికాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని ప్రకటిస్తూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఊతమిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. సింగిల్‌విండో పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తామని, అందులో భాగంగా నెలకు రెండుసార్లు సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, టెక్స్టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోరంగం, బయోటెక్ రంగాలతోపాటు అన్ని రంగాలకు ప్రాధాన్యత కల్పించి ఏపీని పారిశ్రామిక రంగంలో దేశంలోనే టాప్‌గా నిలబెట్టాలన్న లక్ష్యంతో ముందు సాగుతున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.

పెద్దసంఖ్యలోవున్న ఇంజనీర్లు, గ్రాడ్యుయేట్లే రాష్ట్రబలంగా పేర్కొంటూ.. వారికి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంచి స్థానికంగా ఉపాధి కల్పించడమే ధ్యేయమని మంత్రి వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు యూనివర్శిటీలతో, కాలేజీలతో మాట్లాడి ఉపాధికి అనుకూలమైన కరికులమ్ పొందుపర్చే చర్యలు తీసుకుంటామన్నారు. పారిశ్రామిక నైపుణ్యాలు కలిగిన యువత తక్కువగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉపధి నైపుణ్యాలను అందింపుచ్చుకునేలా యువతకు తర్ఫీదునిస్తే, ఇక్కడే మంచి ఉద్యోగాలు సాధిస్తారన్నారు. నూతన ఇండస్ట్రీ పాలసీ రూపకల్పనకు సూచనలు, సలహాలు అందించాలనుకునేవారు ఈ-మెయిల్, పోస్ట్ ద్వారా కూడా తమదృష్టికి తేవొచ్చన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నూతన ఇండస్ట్రీ పాలసీ కూడా సీఎం చంద్రబాబు ప్రకటించనున్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు మొదటి అడుగుగా నూతన ఇండస్ట్రీ పాలసీ ఉండబోతోందని, దేశంలోనే పారిశ్రామికంగా ముందున్న ఐదు రాష్ట్రాల ఇండస్ట్రీల పాలసీలను స్టడీ చేసి మన రాష్ట్రంలో వాటి ఫలితాలు ఎలా ఉంటాయని పరిశీలించి బెస్ట్ పాలసీని అందించనున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

మెడ్‌టెక్ పార్క్ తరహాలోనే రాష్ట్రంలో మరిన్ని సెక్టార్ బేస్డ్ ఇండస్ట్రీ పార్క్‌లను అభివృద్ధి చేయనున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ ఇండస్ట్రీస్ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నేటి స్పీడ్ యుగంలో రోజురోజుకూ టెక్నాలజీ మారిపోతుందని, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆ నైపుణ్యాలు మన యువతకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పీ-4) తో అద్భుతాలు సృష్టించవచ్చని, ఎంఎస్ఎంఈల స్థాపనతో స్థానిక యువతకు పెద్దసంఖ్యలో ఉపాధి లభిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈల స్థాపనకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి, ఉద్యోగకల్పన జరుగుతుందని మంత్రి వివరించారు.

పరిశ్రమల మంత్రి టీజీ భరత్ వర్చువల్‌గా స్టేక్‌హోల్డర్స్‌తో మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితమే సీఎం చంద్రబాబు ఒక సీఈవోలా పనిచేసి రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారించారని, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహించడంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు, కంపెనీలు తరలివచ్చాయని గుర్తుచేశారు. కొత్త ఇండస్ట్రీ పాలసీని వంద రోజుల ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్‌లో తీసుకొస్తున్నట్టు చెప్పారు. నూతన ఇండస్ట్రీపాలసీ బెస్ట్‌గా ఉండేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాలసీ రూపొందించడంలో పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, విద్యుత్, నీరు తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి మంత్రి భరత్ తెలిపారు.

సమవేశంలో పాల్గొన్న స్టేక్‌హోల్డర్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వారి సూచనలు, సలహాలను ఖచ్చితంగా స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. అలాగే స్టేక్‌హోల్డర్స్ సమస్యలను విన్నవించగా వాటిని పరిష్కరిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత, ఇండస్ట్రీస్ శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, పరిశ్రమల వాణిజ్య శాఖ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి రేఖారాణి, సీఐఐ ఏపీ ఛైర్మన్ వి మురళీకృష్ణ, సీఐఐ ఏపీ మాజీ ఛైర్మన్ జెఎస్ఆర్కె ప్రసాద్, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ అభిషేక్ కిషోర్, స్టేక్‌హోల్డర్స్ పాల్గొన్నారు.



చైతన్యరథం

# పోలీస్ వ్యవస్థ బలోపేతం!

- శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- హోంశాఖపై సీఎం సమీక్షలో పలు నిర్ణయాలు
- నిధుల విడుదలకు సీఎం క్లియరెన్స్
- ప్రతి జిల్లాకు సైబర్ క్రైమ్ స్టేషన్
- హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ శాఖకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు రాష్ట్ర హోమ్ మరియు విపత్తుల నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సమావేశంలో పోలీస్ శాఖ పటిష్టతతోపాటు రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గించే విధంగా పలు చర్యలు చేపట్టేలా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, వ్యవస్థ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, వసతులు కూడా కల్పించలేదన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ బిల్లులు చెల్లించకపోవడం, సీసీ కెమేరాలు పనిచేయకపోవడం, మోడరనైజేషన్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ క్రింద కేంద్ర నిధులు సద్వినియోగం చేసుకోకపోవడం, క్షేత్రస్థాయిలో పోలీసులకు వాహన సదుపాయం కల్పించకపోవడం, వాహనాల ఇంధనాన్ని సక్రమంగా ఇవ్వకపోవడం, పోలీస్ స్టేషన్ల నిర్వహణ నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడం వల్ల వ్యవస్థ పూర్తిస్థాయిలో నిర్వీర్యమై రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు ప్రతి పోలీస్ స్టేషన్ వద్ద కనీసం ఆరు సీసీ కెమేరాలు పెట్టాల్సిఉందని, అయితే వాటి బిల్లులను కూడా గత ప్రభుత్వం చెల్లించలేదన్నారు. సమస్యలను తక్షణం అధిగమించేందుకు అవసరమైన సదుపాయాలు, వసతుల కల్పనకు సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు.

## నిధుల విడుదలకు సీఎం క్లియరెన్స్

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి పోలీస్‌స్టేషన్ వద్ద కనీసం అరు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన రూ.11కోట్లను వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వున్న 15 వేల సీసీ కెమేరాల్లో ఏవి పనిచేస్తున్నాయో పది రోజుల్లో గుర్తించాలని, ఎక్కడెక్కడ ఇంకా కెమేరాలు ఏర్పాటు చేయాల్సివుందో గుర్తించాలని ఆదేశించామన్నారు. ఫింగర్‌ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ పెండింగ్ బిల్లుల బకాయిలు రూ.10 కోట్లు కూడా వెంటనే చెల్లించాలని సీఎం ఆదేశించారన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పర్యటనకు అవసరమైన వాహనాలను ఇంకా ఎన్ని సమకూర్చాల్సివుందో వెంటనే గుర్తిస్తే.. వాటినీ సాధ్యమైనంత త్వరగా సమకూర్చుతామని సీఎం హామీ ఇచ్చినట్టు మంత్రి అనిత వెల్లడించారు. ప్రతి వాహనానికీ ప్రస్తుతమిస్తున్న నెలవారీ 150లీటర్ల ఆయిల్‌ను 300 లీటర్లకు పెంచేందుకు సీఎం అంగీకరించారన్నారు.




రాష్ట్రంలో గంజాయి సాగు ప్రాంతాలను గుర్తించి, దాని నిర్మూలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు డ్రోన్ల సహాయం తీసుకోవాలని సూచించారన్నారు. గంజాయి నిర్మూలకు నార్కొటిక్ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేస్తున్నామని, ప్రస్తుతం ఫైనాన్సు డిపార్టుమెంట్‌లో ప్రతిపాదనలు ఉన్నాయని, త్వరలో క్యాబినెట్ అమోదం పొందడం జరుగుతుంద న్నారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు 26 జిల్లాలో గంజాయి దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

### ప్రతి జిల్లాకు సైబర్ క్రైమ్ స్టేషన్

దేశంలో సైబర్ క్రైమ్ కేసులు విస్తృతమవుతున్నాయని, ఏడాదిలో దాదాపు రూ.940 కోట్లమేర నష్టం సంభవించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో డిఎస్పీ స్థాయి అధికారితో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. విజయవాడలో పోలీస్ అకాడమీ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారన్నారు. విశాఖపట్నంలో రూ.290కోట్లతో గ్రేహౌండ్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, దానికి ముఖ్యమంత్రి త్వరలో శంకుస్థాపన చేస్తారన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ప్రతి పోలీస్ స్టేషనుకు ఇన్వెస్టిగేషన్ చార్జీలుగా రూ.8 వేలు ఇచ్చేవారన్నారు. అయితే గత ప్రభుత్వం ఆ చార్జీలను కూడా నిలుపుదల చేసిందన్నారు. తిరిగి ఆ చార్జీలను ఇచ్చేందుకు సీఎం ఆమోదం తెలిపారని, అయితే ఇప్పుడు ఎంత ఇవ్వాలో నిర్ణయించాలని సూచించినట్లు మంత్రి తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం అమరావతిలో దాదాపు రూ.49 కోట్లతో ప్రారంభించిన ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం ఆపేసిందని, అయితే ఆ ల్యాబ్‌ను వర్శిటీగా మార్చి నిర్మాణం కొనసాగించాలని సీఎం ఆదేశించారన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించిన విధంగా త్వరలో తగు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి అనిత వెల్లడించారు.

---

కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో

# మంత్రి లోకేష్ భేటీ



ఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష బుధవారం కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి పీయూష్ గోయల్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని మంత్రి లోకేష్ ఎక్స్‌లో పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు కేంద్ర మంత్రి గోయల్‌తో సమావేశమైనట్లు తెలిపారు.

## చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మరోసారి పోలీసుల ముందుకు జోగి రమేష్

- విచారణకు సహకరించటం లేదన్న డీఎస్పీ

అమరావతి(చైతన్యరథం): చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ విచారణకు సహకరించటం లేదని పోలీసులు తెలిపారు. ఈ కేసులో జోగి రమేష్‌ను బుధవారం పోలీసులు విచారించారు. జోగి తో పాటు



మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ గౌతం రెడ్డి, న్యాయవాది వెంకటేశ్వర శర్మ మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. న్యాయవాది సమక్షంలోనే జోగి రమేష్ విచారణ సాగింది.

అయితే కేసు దర్యాప్తునకు జోగి రమేష్ సహకరించడం లేదని డీఎస్పీ మురళీ కృష్ణ చెప్పారు. పోలీసులకు సరైన సమాచారం ఇవ్వటం లేదన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా జోగి రమేష్ ను మళ్లీ విచారణకు పిలుస్తామని చెప్పారు. ఈ కేసులో ఇటీవలే జోగి రమేష్‌ను పోలీసులు ఒకసారి విచారించారు. బుధవారం రెండోసారి విచారణకు పిలిచారు.

# సెప్టెంబరు 11 నుంచి నూతన ఇసుక విధానం

- రీచ్‌ల వారీగా తవ్వకం, రవాణా ధరలను నిర్ధారించాలి
- 23న గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలి
- ప్రతి గ్రామసభకు ప్రత్యేక అధికారిని నియమించాలి
- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఆదేశం
- గ్రామసభలు, ఇసుక విధానంపై వీడియో కాన్ఫరెన్స్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సెప్టెంబరు 11 నుంచి నూతన ఇసుక విధానాన్ని అమలులోకి తేనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వెల్లడించారు. ఈ విధానం అమలుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను వెంటనే జారీ చేయడం జరుగుతుందని, వాటిని తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గ్రామసభలు,ఉచిత ఇసుక విధానం అమలుపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడు తూ ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుకరీచ్‌ల వారీగా ఇసుక తవ్వకం, రవాణాకు సంబంధించిన ధరలను కలెక్టర్లు నిర్ధారించాలని, ఆ ధరలకు మించి ఎక్కువ ధరకు విక్రయించినట్టు ఫిర్యాదులు వస్తే ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో ఇసుక కోసం బుకింగ్ చేసిన వాహనాలకు ఏ తేదీన ఏ సమయంలో ఇసుకను తీసుకు వెళ్లాలనేది స్పష్టంగా స్లాట్లు కేటాయించాలని సూచించారు. ఇసుక కోసం రిజిస్టర్ చేసిన వాహనాలను మాత్రమే రీచ్‌ల్లోకి అనుమతించాలని, ఇతర వాహనాలను ఎంతమాత్రం అనుమతించరాదని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి సీడ్ యాక్సిస్ రోడ్డు, ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి నందిగామ వద్ద పెద్దఎత్తున లారీలు, ట్రక్కులు గంటల తరబడి వేచి ఉంటు న్నట్టు గమనించామని అలాంటి పరిస్థితులు లేకుండా చూడాలని ఆ రెండు జిల్లాల కలెక్టర్లతో పాటు ఇతర జిల్లాల కలెక్టర్లకు స్పష్టం చేశారు.

### 23న ఒకరోజు గ్రామసభలను విజయవంతం చేయాలి

రాష్ట్రంలో ఈనెల 23న ఒకేరోజు నిర్వహించే గ్రామసభలను విజయవంతంగా నిర్వ హించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఉపాధి హామీపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో విద్య,వైద్యం, తాగునీరు, విద్యుత్, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి, గ్రామం నుంచి మండలాన్ని కలిపే అనుసంధానం చేసే రహదారులు నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పన, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ గ్రామసభలను ఉపయోగించాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు ఈ గ్రామసభల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. గ్రామసభల నిర్వహణను జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడే విధంగా ఈ గ్రామసభలను విజయంతంగా నిర్వహించాలని సూచించారు.

### గ్రామసభల మార్గదర్శకాలు తప్పక పాటించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడు తూ ఈనెల 23న గ్రామసభల నిర్వహణకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి మంజూరైన పనులు, కొత్త పనుల గుర్తింపు, సామాజిక తనిఖీపై గ్రామసభల ద్వారా ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. అంతే కాకుండా గ్రామాల్లో నూరుశాతం కనీస సేవలు కల్పించడం, పామ్ పాండ్ల నిర్మాణం, ఉద్యానవన, పట్టు పరిశ్రమలకు తోడ్పాటు అందించడం, పశు షెడ్ల నిర్మాణం వంటి వాటిపై కూడా చర్చించి వాటి కల్పనపై దృష్టి సారించాలని సూచించారు.

### ఇసుక రవాణా వాహనాలకు యూనిక్ నెంబర్ కేటాయించాలి

రాష్ట్ర భూగర్భ గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల నిర్వహణ, రవాణా, ధరల నిర్ధారణ అంశాలకు సంబంధించి కొన్ని గ్యాప్‌లు ఉన్నా యని వాటిని క్రమబద్ధీకరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. గురువారం జిల్లాల్లో ట్రాన్స్‌పోర్టర్లను పిలిచి ఇసుక రవాణాకు వినియోగించే వాహనాల రిజిస్టర్ చేసి ఒక ప్రత్యేక యూనిక్ నెంబరును కేటాయించాలని సూచించారు. ఆ నెంబరు గల వాహనాలు మాత్రమే ఇసుక రవాణాకు ఉపయోగించాలని మరేఇతర వాహనాలను ఇసుక రవాణాకు అనుమతించరాదని స్పష్టం చేశారు. ప్రతి రీచ్‌వద్ద పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని ఎస్పీలను ఆదేశించారు. టోల్ ఫ్రీ నెంబరుపై జిల్లాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఉచిత ఇసుక విధానంపై వివరించాలని ఆదేశించారు. ఇసుక విధానం అమలుకు సంబంధించి జిల్లా సంయుక్త కలెక్టర్‌ను కంట్రోలింగ్ అధికారిగా నియమించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ మైనింగ్ వంటివి జిల్లాల్లో ఎక్కడ జరిగినా అందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీలే బాధ్యత వహిం చాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వీడియో సమావేశంలో ఆర్థిక శాఖ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ, భూగర్భగనుల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, వర్చువల్‌గా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు.

# జగనన్న భూ సర్వేలో మాయాజాలం

- ఒక్కొక్కరుగా బయటకొస్తున్న బాధితులు
- భూమి విస్తీర్ణాన్ని తగ్గించి ఆన్‌లైన్ చేశారు
- గ్రీవెన్స్‌లో ఎన్టీఆర్ జిల్లా వాసుల వినతి
- సర్వేయర్ లంచం తీసుకున్నాడని ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన రెవెన్యూ మంత్రి అనగాని



మంగళగిరి(చైతన్యరథం):గత ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో భాగంగా చేపట్టిన జగనన్న భూ సర్వేలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తమ భూముల విస్తీర్ణాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలించుకుంటున్న రైతులు భూమివిస్తీర్ణాన్ని తగ్గించి నమోదు చేయడంతో విస్తుపోతున్నారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో సమస్యను చెప్పుకునేందుకు మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల కార్యక్రమానికి వస్తున్నారు. బుధవారం మాజీ మంత్రి కె.ఎస్.జవహర్, మహిళా నేత ఆచంట సునీతతో కలిసి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాకు జగనన్న భూ సర్వే బాధితులు తమ గోడు చెప్పుకున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే కారణంగా అసలు భూమి ఎకరా 37 సెంట్లు ఉంటే ఎకరా 12 సెంట్లుగా తక్కువ చేసి ఆన్‌లైన్‌లో ఎక్కించారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం తూర్పుమాధవరం గ్రామానికి చెందిన పూల పుష్పావతి వాపోయింది. భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి గ్రామ సర్వేయర్ రమేష్ లంచం డిమాండ్ చేసి తీసుకున్నాడని, ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేశారు. అదే గ్రామానికి చెందిన ఆకు తోట లక్ష్మీ నరసింహారావు సమస్యను వివరిస్తూ గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో తమ భూమిని కూడా తగ్గించి ఆన్‌లైన్ చేశారని న్యాయం చేయా లని విజ్ఞప్తి చేశాడు.

- తాము స్థలాన్ని లీజుకు తీసుకుని నిర్మాణాలు చేపడితే నాటి వైసీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ రూ.50 లక్షలు లంచం తీసుకుని తాము చేపట్టిన నిర్మాణాలను కూల్చి వేయించాడని దాంతో తాము తీవ్రంగా నష్టపోయామని కర్నూలుకు చెందిన పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. అక్రమ కూల్చివేతలపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

- తమ ఊరిలో పేదలకు చెందిన 450 ఎకరాలను వైసీపీ నేత నరసింహులు కబ్జా చేసి కంచె వేశాడని అనంతపురం జిల్లా సోమఅందెపల్లి మండలం పోలేపల్లికి చెందిన యలవ బుడ్డప్ప ఫిర్యాదుచేశాడు. పొలం దగ్గరకు వెళితే పోలీసులతో కొట్టిస్తున్నాడని, వారి వల్ల 28 కుటుంబాలు ఇబ్బందిపడుతున్నాయని న్యాయం చేయాలని కోరారు.

- పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన చామకూరి కుసుమకుమారి పద్మావతి సమస్యను వివరిస్తూ నరసాపురం మండలం లింగబోయనచర్ల గ్రామ పంచాయతీ రామకూరిపాలెం గ్రామంలో కొంత భూమి ఉందని,మాజీ ఎమ్మెల్యే ముదునూరి అనుచరులు దాన్ని కొట్టేయడానికి కుట్రపన్నారని, సర్వేకు దరఖాస్తు చేస్తే నాడు రెవెన్యూ అధికారులు చాలాసార్లు తిరస్కరించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని వాపో యారు. గత వైసీపీ ఎమ్మెల్యేకు తొత్తులుగా పనిచేసిన అధికారులపై చర్యలుతీసుకుని న్యాయంచేయాలని బాధితురాలు వినతిపత్రం ఇచ్చారు.

- చంద్రగూడెంలో తన భర్త తాత కొన్న భూమిలోకి వెళ్లకుండా తమను కొంతమంది గిరిజనులు అడ్డుకుంటున్నారని అధికారుల చుట్టూతిరిగినా పట్టించుకోవడం లేదని ఏలూరు జిల్లా పోలవరానికి చెందిన ఎండపు విజ్ఞేశ్వరి ఆవేదన వ్యక్తంచేసింది.వైసీపీ నాయకులు దీని వెనుక ఉండి నడిపిస్తున్నారని వాపోయారు. తమకు ఆ పొలమే ఆధారమని న్యాయంచేయాలని వేడుకున్నారు.

- గత 21 సంవత్సరాలుగా తమ సాగులో ఉన్న భూమికి దొంగ పట్టాలు సృష్టించి తమ భూమిని కొట్టేయడానికి గుది సుబ్బారావు, మిట్టా తిరుపతయ్యలు యత్నిస్తున్నారని కనిగిరి మండలం చల్లగిరిగల గ్రామానికి చెందిన వీరనారాయణమ్మ మంత్రికి ఫిర్యాదు చేశారు. సాగు చేసుకుంటున్న భూమిలోకి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు.

- గత 50ఏళ్ల నుంచి నేటికీ బయ్యవరం గ్రామంలో 2.50 ఎకరాల భూమి తన స్వాధీనంలో ఉందని.. అయితే తాళ్లపూడి రెవెన్యూ అధికారి ఎన్.వి.ఎన్.కె. ప్రసాద్ ఆ భూమి మరోకరిదిగా చెబుతున్నారని వాస్తవాలను పరిశీలించి న్యాయం చేయాలని తూర్పుగోదావరిజిల్లా తాళ్లపూడిమండలం తుపాకులగూడెం గ్రామానికి చెందిన ఉండవల్లి వెంకటలక్ష్మి వేడుకున్నారు.

- వంశపారపర్యంగా వచ్చిన భూమిలోకి తమను వెళ్లకుండా బెదిరిస్తున్నారని దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విచారణ జరిపి న్యాయం చేయాలని పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన గుమ్మళ్ల బ్రహ్మయ్య అర్జీ ఇచ్చారు.

- కోర్టు ఉత్తర్వులు ఉన్నా బోగస్ పత్రాలు సృష్టించి తమ భూమి 3.04 ఎకరాలను కబ్జా చేసి కట్టడాలు ప్రారంభించారని విచారణ జరిపించి న్యాయం చేయాలని అనంతపురం జిల్లా కదిరికి చెందిన కె.సికిందర్ విన్నవించారు.

- విజయనగరం జిల్లా పూజపాటిరేగ మండలం కోనాడలో పలువురు వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని రేకుల షెడ్‌లు వేశారని, అంతేకాకుండా స్మశాన స్థలాన్ని కబ్జా చేసి రొయ్యల చెరువులు తవ్వారని ఈ ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాసుపల్లి దినేష్ ఫిర్యాదు చేశాడు.

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 750 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించే సత్యసాయి ప్రాజెక్ట్‌ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రాజెక్ట్ నిర్వహణకు ఉన్న రూ.2.30కోట్లను వైసీపీ ప్రభుత్వం రూ.1.20 కోట్లకు తగ్గించిందని దాంతో ప్రాజెక్ట్ మెయింటెన్స్ సక్రమంగా లేదని సత్యసాయి కార్మికులు తెలిపారు. గత ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు కూడా ఇవ్వడం లేదని, ఏడు నెలల నుంచి పీఎఫ్, ఈఎస్ఐసీలు కార్మికుల ఖాతాలకు చెల్లించడం లేదని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఈలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

- జి.ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి తనకు మాయ మాటలు చెప్పి తన నుంచి రూ.25 లక్షలు కాజేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తిరుపతికి చెందిన పి.గౌతమ్ ఫిర్యాదు చేశాడు. అతని నుంచి డబ్బులు ఇప్పించాలని కోరాడు.

- మదనపల్లి నియోజకవర్గం నిమ్మనపల్లి మండలానికి చెందిన పొరపట్ల రమణప్ప తన సమస్యను వివరిస్తూ మత్స్యకార సంఘ సభ్యులకు వలలు, బోట్లు, ఐస్ బాక్స్‌లు, చేప పిల్లలు, మోటార్ వాహనాలు సబ్సిడీ కింద ఇవ్వాలని కోరాడు.





## ఇది పేదల ప్రభుత్వం: మంత్రి అనగాని

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి ప్రభుత్వంలోని అరాచకాలను, అన్ని ఇబ్బందులను తొలగించడానికి టీడీపీ అధినేత చంద్రబాబు గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గతంలో సామాన్యులు ముఖ్యమంత్రి, మంత్రులను సెక్రటేరియట్‌కు వెళ్లి కలవాలంటే సాధ్యపడేది కాదన్నారు. నేడు సీఎం నుంచి మంత్రులు, నేతలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ కేంద్రకార్యాలయంలో గ్రీవెన్స్‌ఏర్పాటు చేసి ఇదిపేదల ప్రభుత్వమని నిరూపించారని తెలిపారు. గత ఐదేళ్లలో భూ దోపిడీలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ఆన్‌లైన్‌లో పేర్లు మార్చి గత పాలకులు ప్రజలను ఇబ్బంది పెట్టారని చెప్పారు. అటువంటి సమస్యల పరి ష్కారానికి వచ్చే నెల నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. భూ సమస్యలతోపాటు పింఛన్, రేషన్ కార్డు సమస్యలు కూడా వచ్చాయని, వచ్చిన ప్రతి అర్జీదారుడికి న్యాయం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే మానాయకుడి లక్ష్యమని, అందుకు తగినట్లు ప్రజల కోసం తామంతా పనిచేస్తున్నామని వివరించారు.





# కన్నయ్యా.. నువ్వు గ్రేటయ్యా!

- స్టాప్ లాగ్ ఏర్పాటులో నీ నైపుణ్యం అమోఘం
- భారతదేశ చరిత్రలోనే ఇదొక అపూర్వ ఘట్టం
- 40 టీఎంసి తుంగభద్ర జలాలు పదిలం
- రాష్ట్ర రైతాంగం తరపున కన్నయ్యకు కృతజ్ఞతలు
- రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల



అమరావతి (చైతన్య రథం): వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుండగా తుంగభద్ర 19వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ గేటును ఏర్పాటు చేయడమనేది భారతదేశ చరిత్రలోనే అపూర్వ ఘట్టమని, అటువంటి రికార్డును సృష్టించిన సాగునీటి రంగ నిపుణులు కన్నయ్య నాయుడుకు రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అభినందనలు తెలిపారు. స్టాప్ లాగ్ గేటు ఏర్పాటువల్ల సుమారు 40 టీఎంసి జలాలు వృధాకాకుండా కాపాడుకున్నామన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారి కన్నయ్య నాయుడుతో కలసి మంత్రి మీడియాతో మాట్లాడారు. తుంగభద్ర రిజర్వాయరు 19వ గేటు వరదనీటికి కొట్టుకుపోవడంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది. అటువంటి క్లిష్టపరిస్థితులలో సంక్షోభాలను అధిగమించడంలో మంచి అనుభవం ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు సాగునీటి రంగంలో దాదాపు 50 ఏళ్ల అనుభవమున్న కన్నయ్య నాయుడు సహాకారంతో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు చేయడం జరిగింది. ఫలితంగా నేడు సుమారు 77 టీఎంసీ జలాలు రిజర్వాయరులో నిల్వ ఉండటం వల్ల రాయలసీమ ప్రాంతంలోని ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సి, కెసి కెనాల్‌కు సమృద్ధిగా తాగునీరు, సాగునీరు అందించగలిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోయిందని తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధరాత్రి సైతం నాతో, అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ మరియు జలవనరుల శాఖ కార్యదర్శితో కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేయడంవల్లే సంక్షోభం నుండి గట్టెక్కగలిగామన్నారు. లేకుంటే తుంగభద్ర జలాశయం ద్వారా తాగు, సాగునీరు పొందే అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలతో పాటు తెలంగాణకు చెందిన ప్రజలు, రైతులు ఎన్నో సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడేదన్నారు. రాష్ట్ర రైతాంగం ప్రత్యేకించి రాయలసీమ రైతాంగం తరపున కన్నయ్య నాయుడికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు కన్నయ్య నాయుడు మాట్లాడుతూ గత 52ఏళ్లుగా సాగునీటి రంగంలో పనిచేస్తూ దక్షిణాది రాష్ట్రాల్లో ఇలాంటి గేట్లు ఎన్నో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుంగభద్ర డ్యామ్‌ను 1954లో కమిషనింగ్ చేయడం జరిగిందని, దాని కాలపరిమితి 45 ఏళ్లుకాగా, ఇప్పటి వరకూ దాదాపు 70 ఏళ్లపాటు పనిచేయడం జరిగిందన్నారు. 1970లోపు ఏర్పాటుచేయబడిన తుంగభద్ర, ప్రకాశం, నాగార్జునసాగర్ డ్యామ్‌కు స్టాప్ లాగ్స్ లేవన్నారు. 2002లో ప్రకాశం బ్యారేజ్ గేట్లు మార్చడం జరిగిందన్నారు. తీవ్రమైన వరదనీటిలో రిస్కు తీసుకుని తుంగభద్ర రిజర్వాయరు గేటుమార్చడం అనే పనిని చాలెంజ్‌గా నిర్వహించడం జరిగిందన్నారు. 50మంది సాయంతో ఐదు రోజుల్లో గేటు డిజైన్‌చేసి ఏర్పాటు చేయడమనేది ఒక రికార్డు అన్నారు. ఇప్పుడు 26 లక్షల ఎకరాలకు నీరు లభించినట్లేనని కన్నయ్య నాయుడు అన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి విద్యార్థి మృతి

**కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి లోకేష్**



కడప,అమరావతి: కడప నగరంలోని అగాడివీధిలో బుధవారం మధ్యాహ్నం వీధిలో తెగిపడిన విద్యుత్‌తీగలు తగిలి ఓవిద్యార్థి మృతిచెందగా,మరో విద్యార్థి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తస్వీర్(11) అదాం(10) అనే విద్యార్థులు సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా.. రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు స్పందించి చిన్నారులను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తస్వీర్ మృతి చెందాడు. విద్యుత్‌శాఖ అధికారులనిర్లక్ష్యమే ఈప్రమాదానికి కారణమని విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటనపై రాష్ట్ర విద్య,ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ స్పందించారు.విద్యుత్ తీగలు తగిలి తస్వీర్ అనే చిన్నారి మృతి చెందిన ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. విద్యుదాఘాతంతో గాయపడిన మరోవిద్యార్థికి మెరుగైన వైద్యంఅందించాల్సిందిగా అధికారులను ఆదేశించానన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

### జగన్ విదేశీ పర్యటనకు

## అనుమతి ఇవ్వొద్దు

- కోర్టులో సీబీఐ కౌంటర్
- తీర్పును 27కి వాయిదా వేసిన నాంపల్లి సీబీఐ కోర్టు

హైదరాబాద్: విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలంటూ మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసుకున్న అభ్యర్థనను సీబీఐ వ్యతిరేకించింది.విదేశాలు వెళ్లేందుకు అనుమతి కోరుతూ నాంపల్లి సీబీఐ కోర్టులో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళ వారం పిటిషన్ వేశారు. సెప్టెంబర్ మొదటి వారంలో 20 రోజుల పాటు కుటుంబంతో కలిసి లండన్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని జగన్ కోరారు. లండన్‌లో ఉన్న కూతురుని చూడటానికి వెళ్లాలని, అనుమతి ఇవ్వాలని జగన్ తరఫు న్యాయవాది వాదన వినిపించారు.


విదేశీ పర్యటనకు జగన్ అనుమతి కోరటం ఈ ఏడాదిలో ఇది రెండో సారి. ఏపీ ఎన్నికలు పూర్తి అయిన తరువాత 15రోజులు పాటు జగన్ విదేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే. తిరిగి ఇప్పుడు మరోసారి విదేశాలకు వెళ్లేం దుకు జగన్ అనుమతి కోరగా... అనుమతి ఇవ్వదంటూ సీబీఐ బుధవారం కౌంటర్ దాఖలు చేసింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణ వేగవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వద్దని సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌కు సంబంధించి ఇరువురి వాదనలు పూర్తి అవగా.. తీర్పును ఈ నెల 27న వెల్లడిస్తామన్న సీబీఐ కోర్టు తెలిపింది. అలాగే విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 30న సీబీఐ కోర్టు తీర్పు వెల్లడించనుంది.



### అమరావతి, అన్న క్యాంటీన్లకు

## రూ.2 కోట్ల విరాళమిచ్చిన ఠాగూర్

- రాజధానికి రూ.10 లక్షలు విరాళమిచ్చిన ఎన్వీ
- అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): అన్న క్యాంటీన్, అమరావతి రాజధాని నిర్మాణానికి పలువురు విరాళాలు అందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని బుధవారం సచివాలయంలో కలిసి చెక్కులు అందించారు. విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త, డీఆర్‌ఎన్ ఠాగూర్ గ్రూప్ ఛైర్మన్ ధనేకుల రవీంద్ర నాథ్ ఠాగూర్ రాజధాని అమరావతి, అన్న క్యాంటీన్‌లకు కోటి రూపాయలు చొప్పున రూ.2కోట్లు విరాళంగా ఇచ్చారు. కడప జిల్లా పాయసం పల్లెకు చెందిన ఎన్వీ నారాయణరెడ్డి రాజధానికి రూ.10,00,116ను విరాళంగా అందించారు. రాజధానిలో భాగస్వామ్యం కావాలనే స్ఫూర్తితో, పేదలకు అన్నంపెట్టే అన్న క్యాంటీన్‌కు చేయూతను ఇవ్వాలనే మంచి ఆలోచనతో విరాళం ఇచ్చిన రవీంద్రనాథ్ ఠాకూర్, ఎన్వీ రమణారెడ్డిలను సీఎం చంద్రబాబు అభినందించారు.



## అంబేద్కర్ ఆశయాల మేరకు కూటమి పాలన

- మంత్రి డోలా స్పష్టీకరణ
- అంబేద్కర్ స్మృతి వనం ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష



అమరావతి (చైతన్యరథం): విజయవాడ స్వరాజ్య మైదానంలోని అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టుపై అధికారులతో బుధవారం నాడు వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. ప్రాజెక్టు వివరాలు, పెండింగ్ పనులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి అధికారులు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. స్మృతి వనం ప్రాజెక్టును ఏపీఐఐసీ నిర్మిస్తోందని, దాని నిర్వహణ బాధ్యతలు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చూస్తుందన్నారు. నిర్వహణ బాధ్యతలు ఎవరు చూడాలనే దానిపై స్పష్టత లేదని అధికారులు చెప్పగా, స్మృతివనం నిర్వహణ బాధ్యతలు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చూడాలని మంత్రి సూచించారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అన్నారు.

ఈ సమీక్ష సమావేశం లో సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి. కన్నబాబు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య వేణి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, విజయవాడ మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో జగన్ కేసుల పేపర్లు ఏమైనా తగులబడ్డాయా?

మంగళగిరి (చైతన్యరథం): 12 ఏళ్లయినా జగన్ కేసులు విచారణ జరపక పోవడంలో అర్థమేంటి? జగన్‌రెడ్డి, విజయ సాయిలకు ఎందుకు శిక్ష పడలేదు? కోర్టులో జగన్‌కేసుల పేపర్లు ఏమైనా తగులబడ్డాయా? సుప్రీంకోర్టు చీఫ్ జస్టీస్‌ను కోరుతున్నా... జవాబు కావాలి అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సినిమా టికెట్ కొనడానికి డబ్బుల్లేని జీవితం గడిపిన జగన్, విజయసాయిలు నేడు యూరప్‌కు వెళ్లగలిగే స్థాయికి ఎలా ఎదిగారని ప్రశ్నించారు. జగన్, విజయ సాయిరెడ్డి వంటి వారికి కోర్టులు వెసలు బాటు కల్పించడం కరెక్టు కాదన్నారు. ఏ1 ముద్దాయి జగన్, ఏ2 ముద్దాయి విజయసాయికి యూరప్‌లో ఏమున్నాయని పర్యటనలకు అనుమతి కోరుతున్నారు? వీరిపై విచారణ ఎందుకు జరగడం లేదు? వీరు కోర్టులకు ఎందుకు హాజరుకావడం లేదు? అని ప్రశ్నించారు. సీఎం కేజ్రీవాల్ సీఎం అయినా జైలులో ఉన్నాడు.. మరి జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేసులున్నప్పటికీ ఎందుకు బయట ఉన్నాడు? 12ఏళ్ల పాటు జగన్, విజయసాయిలపై విచారణ జరపక పోవడంలో అర్థమేంటి? కోర్టుల మీద నమ్మకం సన్నగిల్లే ప్రమాదాల నుంచి కాపాడాలని జస్టీస్ చంద్రచూడ్‌ను కోరుతున్నాను. జగన్ కేసులో రోజు వారీ విచారణ జరగాలి, జగన్ తప్పు చేశాడా లేదా అని త్వరితగతిన కోర్టు తేల్చాలని విజ్ఞప్తిచేశారు.

- ప్రజల్లో కోర్టుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి
- 12 ఏళ్లయినా విచారణ జరపకపోవడంలో అర్థమేంటి?
- జగన్‌రెడ్డి, విజయసాయిలకు ఎందుకు శిక్ష పడలేదు?
- సుప్రీంకోర్టు చీఫ్ జస్టీస్‌ను కోరుతున్నా...జవాబు కావాలి
- విచారణలో జాప్యంపై సమీక్ష చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా
- రోజువారీ విచారణ చేసి తప్పు చేశారో..లేదో తేల్చాలి
- న్యాయస్థానాల ఉదాశీనత వల్లే బయట తిరుగుతున్నారు
- పేరుమోసిన ఆర్థిక నేరస్థుల కేసుల్లో ఎందుకంత జాప్యం
- ఏ1, ఏ2లకు యూరప్‌లో ఏమున్నాయని వెళుతున్నారు
- విచారణ పూర్తయ్యే వరకు విదేశీ పర్యటనకు అనుమతివ్వొద్దు
- వారిద్దరికీ అనుమతిస్తే తిరిగి వస్తారన్న నమ్మకం లేదు
- పదేపదే ఎందుకు వెళుతున్నారో క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలి
- అక్రమాస్తులు ఉన్నాయా?పర్యటనకు డబ్బులెక్కడివి?
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ప్రశ్నలు



## విదేశీ పర్యటనకు అనుమతివ్వొద్దు

యూరప్ పర్యటనకు జగన్‌కు అనుమతి ఇస్తే ఇతర ముద్దాయిలు కూడా అనుమతి అడుగుతారని, అవినీతి, నేర చరిత్ర ఉన్న జగన్, విజయసాయిలు బాహ్య ప్రపంచంలో తిరుగుతుంటే బాధేస్తోందన్నారు. జగన్ విదేశాలకు వెళితే ఏం జరుగుతుందో కోర్టు పున:పరిశీలన చేయాలని, కేసుల విచారణ పూర్తయ్యే వరకు జగన్ విదేశాలకు వెళ్లకుండా చూడాలని కోరారు. మన దురదృష్టంవల్ల జగన్ మొన్నటి వరకు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి. ప్రస్తుతం ఆయనకు దుర దృష్టం వెంటాడి 150 సీట్ల నుంచి మధ్య లోని 5 ఎగిరిపోయి 11 సీట్లు వచ్చా యి. ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితి. ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. నెత్తిన కొట్టి కూర్చోబెట్టారు. ఏ1 ముద్దాయి జగన్ 11కేసుల్లో చార్జ్‌షీట్లు ఎదు ర్కొంటున్నాడు. 12 ఏళ్ల క్రితం చేసిన నేరాలు అలాగే ఉన్నాయి. ఇక ఏ2 ముద్దాయి విజయ సాయిరెడ్డి రాజ్య సభ సభ్యుడిగా ఉన్నాడు. మంచి రికార్డులున్న వారు, పెద్దలు మాత్ర మే రాజ్యసభలో ఉంటే తులసివనంలో గంజాయి మొక్కలా విజయసాయి ఎంపీగా ఉన్నాడు. లోక్‌సభలో పాస్ అయిన బిల్లుల ను రాజ్యసభకు పంపిస్తారు. రాజ్యసభలో ఆమోదం పొందాక ఆ బిల్లులు అమలు లోకి వస్తాయి. అలాంటి అత్యున్నత సభలో విజయసాయి ఉండడం బాధాకరమన్నారు. 3 సార్లు ఎంపీగా ఉండి విజయసాయి సాధించింది శూన్యమని వ్యాఖ్యానించారు.

## ఎందుకు వారికి శిక్ష పడటం లేదు?

జగన్‌ను కోర్టులో జగన్..జగన్.. జగన్ అని పిలిస్తే జగన్‌తో పాటు విజయసాయి కూడా హాజరవుతారు. రాష్ట్ర ప్రజల సొమ్ము దాదాపు రూ.43 వేల కోట్లు కొట్టే శారు. అయి నా న్యాయస్థానాల ఉదాశీనత ఎందుకు? కేసుల్లో బొరవ చూపకపోవడం ఏమిటి? కోర్టులు తీసు కోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల 12ఏళ్లుగా విచారణ లేకుండా ఇష్టమొచ్చినట్లుగా తిరుగుతున్నారు. సీబీఐ వారి అవినీతిని బహిర్గతం చేసినా శిక్ష మాత్రం పడలేదు. వీరంతా ముద్దాయిలని అందరికీ తెలుసు. ఏ తప్పుచేయని పవిత్రుల్లాగా బాహ్య ప్రపంచంలో తిరు గుతుంటే బాధేస్తుంది. ఎందుకు వీరికి కోర్టులచే శిక్ష పడడం లేదని సుప్రీంకోర్టు చీఫ్ జస్టీస్ చంద్రచూడ్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను. కోర్టులో వీరి కేసుల పేపర్లేమైనా తగులబడ్డాయా? అనే అనుమానం కలుగుతోంది. కోర్టును తప్పు పట్టడం లేదు కానీ వీరికి శిక్ష ఎందుకు పడడం లేదో నాకు సమాధానం కావాలి. తప్పు చేసి, అవినీతికి పాల్పడి ఏ విచారణ లేకుండా నిస్సిగ్గుగా, బేసిగ్గుగా జగన్, విజయసాయిలు తిరుగుతున్నారు. 6 నెలల పాటు యూరప్‌కు వెళ్లాలని పర్మిషన్ అడుగుతున్నారు. యూరప్ వెళితే ఈ అవినీతి పరులు తిరిగి వస్తారా అనే అనుమానం కలుగుతోంది. వీరి వెనుక చాలా నేర చరిత్ర ఉంది. వీరు యూరప్ వెళ్లటానికి వీలు లేదని సీబీఐ చెప్పింది. వీరు యూరప్ వెళితే కోర్టును ప్రభావితం చేయగలరు. వీరేమీ అవినీతిరహి తులు కారు. పెద్ద పెద్ద నేరచరిత్ర కలవారు. పెద్ద పెద్ద నేరస్థులందరూ లండన్‌లో దిగుతున్నారట. జగన్ కూడా లండన్‌కు వెళతానన దంలో అర్థమేమిటి? నేర స్థులుగా ఉండి 6 నెలలు, 3 నెలలు విదేశాలేమిటి? వారికి విదేశాల్లో ఏముందో తెలియాలి. అక్రమాస్తులే మైనా నిక్షిప్తం చేశారా? లేకపోతే ఎందుకు వీరికి యూరప్ ప్రయాణం? యూరప్‌లో తిరగడానికి డబ్బు లెక్కడివి? అని ప్రశ్నించారు.

## 12 ఏళ్లయినా విచారణ లేకపోవడం అనుమానంగా ఉంది

ఎన్నో కేసుల్లో ఏ1గా ఉన్న వ్యక్తి ఇప్పుడు విదేశాలకు వెళ్లడానికి అనుమతిస్తే ఆయన తిరిగి భారతదేశా నికి వస్తాడన్న నమ్మకం లేదు. ఏ2గా ప్రతీ కేసులో ఏ1కు తోడు నీడగాఉన్న విజయసాయిరెడ్డి కూడా ఈ పరిస్థితుల్లో విదేశాలకు పోవడానికి కోర్టు అనుమతి ఇవ్వకూడదు. ఇస్తే తిరిగి రారు. 12సంవత్సరాల క్రితం వీరిద్దరిపై సీబీఐ చార్జ్‌షీట్‌లు వేస్తే ఇంత వరకు విచారణ మొదలుపెట్టలేదు. విచారణ ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. మామూలు ముద్దాయిల పట్ల ఎంతో పకడ్బందీగా వ్యవహరించే న్యాయస్థానాలు, పేరు మోసిన ఈ ఇద్దరి ఆర్థిక నేరస్థుల పట్ల ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారనే అనుమానం రాష్ట్రప్రజలకు కలుగుతోందని వ్యాఖ్యానించారు. జగన్‌కు బెయిల్ ఇచ్చేటప్పుడే సుప్రీంకోర్టు ఇంత తక్కువ సమయంలో ఇన్ని కోట్లు ఎలా సంపాదిం చారని వ్యాఖ్యానించింది.. అటువంటిది ఈ కేసుల్లో విచారణ 12 ఏళ్లయినా మొదలు పెట్టకపోవడం అనుమానాలకు రేకెత్తిస్తుంది. గౌరవ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ ముద్దాయిల వ్యవహార శైలి పట్ల, కేసుల విచారణలో జాప్యం పట్ల సమీక్ష చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. తెలం గాణ హైకోర్టు కూడా ఈ ముద్దాయిల కేసుల విచారణలో జాప్యంపై సమీక్ష చేయాలని కోరారు.

## విదేశీ పర్యటనలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలి

ఏ1, ఏ2లు ఎందుకు యూరప్ వెళ్లాలని ప్రయత్నిస్తున్నారు? అక్కడ ఇన్ని రోజులు ఏమి చేయాలనుకుంటున్నారు? సీబీఐ క్షుణ్ణంగాదర్యాప్తుచేయాలని కోరారు. రూ.43 వేల కోట్లు అన్యాక్రాంతం చేశారని ఓ పక్క సీబీఐ చార్జిషీట్‌లు, మరో పక్క ప్రజాధనాన్ని కొల్లగొట్టారని అరోపణలెదు ర్కొంటున్న వీరిద్దరూ పదేపదే లండన్ ఎందుకు వెళుతున్నారో విచారణ చేయాల్సిన బాధ్యత సీబీఐ మీద ఉందన్నారు. ఇప్పటికైనా న్యాయస్థానాలు ఏ1, ఏ2 కేసులపై రోజువారీ ప్రాతిపదికన విచారణ చేపట్టి త్వరితగతిన విచారణ పూర్తిచేసి నిజా నిజాలు వెలికితీయాలని కోరారు. తొందరపడి ఏ1, ఏ2కు విదేశీ యాత్రకు అనుమ తిస్తే తిరిగొస్తారన్న గ్యారంటీ లేదు. ఈ కేసుల్లో విచారణ పూర్తయ్యేంత వరకు ముద్దాయిలకు విదేశీ యాత్రలకు అనుమతి ఇవ్వకూడదని కోరారు.

# సుప్రీం చెంపదెబ్బ కొట్టినా బుద్ధి రాదా జగన్‌రెడ్డీ?

- నేరస్థులు నేరాల గురించి మాట్లాడటం హాస్యాస్పదం
- కోర్టు మెట్లెక్కి వాటి పవిత్రతను పోగొడుతున్నారు
- కరకట్ట కమలహాసన్‌తో చేసిన కుట్రలు విఫలం
- చంద్రబాబుపై బురద జల్లడం మానుకోవాలి
- మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ హితవు

మంగళగిరి(చైతన్యరథం): జగన్‌రెడ్డి వేయించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు చెంపదెబ్బల తో ఇప్పటికైనా కళ్లు తెరవాలని డిమాండ్ చేస్తున్నానని మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ అన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ అవసరాల కోసం మమ్మల్ని వాడుకోవద్దు అని సుప్రీంకోర్టు జగన్‌రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో అయన నేరచరిత్ర వెల్లడైందన్నారు. జగన్‌రెడ్డికి హైకోర్టు మొట్టికాయలు వేస్తే అవి చాలవన్నట్లు చెంపదెబ్బలు కావాలని సుప్రీంకోర్టుకు వెళ్లాడు. ఓటుకు నోటు కేసు విషయంలో సుప్రీంకోర్టుకు వెళ్లి చంద్రబాబుపై జగన్ బురద జల్లాలని ప్రయత్నం చేసి బొక్కబోర్లా పడ్డారని వ్యాఖ్యానించారు. 2019-24 మధ్య చంద్ర బాబుపై 12 కేసులు పెట్టి వేధించారు.. 15 సభాసంఘాలు, 2 మంత్రివర్గ సంఘాలు, 4 న్యాయ విచారణ సంఘాలు, సీబీసీఐడీ వంటి ఉన్నతాధికారులతో విచారణ చేయించి కొండను తవ్వి ఎలుకను పట్టాలని జగన్ ప్రయత్నాలు చేశాడన్నారు. చివరకు కొండ లేదు, ఎలుకా లేని పరిస్థితి అయిందని ఎద్దేవా చేశారు.



## ప్రజాప్రభుత్వంపై అడుగడుగునా కుట్రలు

జగన్మోహన్ రెడ్డి అనుంగ శిష్యుడు అళ్ల రామకృష్ణారెడ్డి ఓ కరకట్ట కమల హాసన్. జగన్, కరకట్ట కమలహాసన్ ఇద్దరూ కలిసి చంద్రబాబుపై బురదజల్లడానికి పూనుకున్నా రు. జగన్ ఆలోచనలను కరకట్ట కమలహాసన్ ప్రజల్లోకి తీసుకెళ్లే పనిలో ఉన్నాడు. ఈ కరకట్ట కమలహాసన్ 2024 ఎన్నికల్లో నారా లోకేష్‌పై గెలవలేక వైసీపీ నుంచి పారిపోయి షర్మిల కాళ్లమీద పడ్డాడు. మళ్లీ జగన్మోహన్‌రెడ్డి వద్దకు వచ్చి దొంగలు దొంగలు కలిసి గూడు పుఠాణి చేయడం మొదలుపెట్టారు. మనిషికొక మాట, పశువుకొక దెబ్బ అనే నాను డికి భిన్నంగా జగన్మోహన్ రెడ్డి మనిషి, పశువు కాకుండా మరేదో వింత జీవిలా ప్రవర్తిస్తు న్నాడని వ్యాఖ్యానించారు. ప్రజా ప్రభుత్వాన్ని చంద్రబాబు ముందుకు నడపడాన్ని జీర్ణించు కోలేక అడుగడుగునా అడ్డుపడాలని జగన్ చూస్తున్నాడని మండిపడ్డారు.

## జగన్‌రెడ్డి, ఆళ్లకు కోర్టు మెట్లెక్కే అర్హత ఉందా?

జగన్మోహన్‌రెడ్డికి జైలు, 34 కేసులు ఓ బ్రాండ్ అయితే చంద్రబాబు అంటే అభివృద్ధి, హైటెక్ సిటీ, సాగునీటి ప్రాజెక్టులు, నదుల అనుసంధానం ఓ బ్రాండ్. జగన్ తనకున్న క్రైం బ్రాండ్‌ను చంద్రబాబుకు కూడా అంటించాలని ప్రయత్నాలు చేస్తూ ప్రతి సందర్భంలోనూ విఫలం అవుతున్నాడు. గతేడాది చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో సరైన పద్ధతిని జగన్ అనుసరించలేదు. అళ్ల రామకృష్ణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి అనే వ్యక్తులకు కోర్టు మెట్లు ఎక్కే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. నేరాలు చేసేవాళ్లు నేరాలు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏ విధంగా అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆలో చిస్తుంటే..వాటిని చెడగొట్టాలని జగన్మోహన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి మద్య నిషేధం అని చెప్పి చివరకు మద్యంపైనే అప్పులు తెచ్చాడు.

అత్యధిక రేట్లకు మద్యాన్ని అమ్ముకున్నాడు.. ఆ డబ్బంతా తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిందా? అని ప్రశ్నిం చారు. జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానేయాలని హితవుపలి కా రు. తన కూతురుని చూసుకోవడానికి విదేశాలకు వెళ్లాలన్నా కోర్టు అనుమతి తీసుకోవా ల్సిన పరిస్థితి..ఇలాంటి వ్యక్తి చంద్రబాబుపై ఆరోపణలు చేయడం దుర్మార్గమని మండిపడ్డా రు. చంద్రబాబుపై జగన్‌రెడ్డి పెట్టిన ఏ కేసూ నిలబడిన దాఖలాలు లేవన్నారు. కోర్టు మెట్లు ఎక్కితే ఆ కోర్టు మెట్లు కూడా పవిత్రతను కోల్పోతాయని, ఇప్పటికైనా జగన్ తన తీరు మార్చుకోవాలని హితవుపలికారు.



# ఇకపై ఇలాంటి పరిస్థితి రానివ్వను

◆ఎమ్మెల్యే పరిటాల సునీత

◆రూ.30 లక్షలతో కల్వర్టులు, రోడ్డు నిర్మాణం

◆సదాశివకాలనీ వాసులకు సునీత హామీ

◆2 రోజులుగా పిల్లలు స్కూల్‌కి వెళ్లలేదన్న కాలనీ వాసులు

అనంతపురం (చైతన్యరథం): అనంతపురం రూరల్ మండలంలో వరద నీటితో వస్తున్న ఇబ్బందులనుంచి కాలనీల వాసులను కాపాడుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ ఇచ్చారు. అక్కంపల్లి పంచాయతీ సదాశివ కాలనీలోని వంక రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొంగిపొర్లింది. కాలనీలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అటు వైపు నుంచి ఇటు వైపు రాకపోకలు రెండు రోజులుగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సునీత ఇవాళ పంచాయరాతీ రాజ్ ఇతర విభాగాల అధికారులతో కలసి కాలనీకి వెళ్లారు. వంక నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. స్థానికంగా కాలనీ వాసులు వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. అటు వైపుకు వెళ్లే మార్గం లేక రెండు రోజులుగా పిల్లలు పాఠశాలకు కూడా వెళ్లడం లేదన్నారు. అధికారులతో కలిసి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ కాలనీ వరద నీటికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే 30లక్షలు నిధులు తీసుకొచ్చి ఇక్కడ పనులు చేపడుతామన్నారు. అందుకు ప్రణాళికలు తయారు చేయాల్సిందిగా అధికారులను అదేశించారు. ముందుగా 20లక్షలతో అధిక ప్రవాహం ఉన్న ఒక కల్వర్టు, 10లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఈ సమస్య తీవ్రంగా కనిపించినా.. హామీలు తప్ప.. నిధులు ఇవ్వలేదని విమర్శించారు. వచ్చే వర్షాకాలంలోపు ఈ సమస్య లేకుండా చేస్తామని ఈసందర్భంగా సునీత అన్నారు.



# అన్న క్యాంటీన్లు, అమరావతి కోసం సాయం అందించండి

◆అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు

అనంతపురం (చైతన్యరథం): లోటు బడ్జెట్ లో ఉన్న రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరగాలంటే కేవలం ప్రభుత్వ నిధులతోనే సాధ్యం కాదని సంక్షేమం, అభివృద్ధి నేరుగా ప్రజలకు అందాలంటే ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే దుగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్న క్యాంటీన్లు, అమరావతి నిర్మాణానికి పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు సాయం అందించాలని ఆయన కోరారు. బుధవారం అనంతపురానికి చెందిన దత్త శిల్ప్ అధినేత దత్త శివ అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం రూ.1 లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు అందించారు. రాష్ట్రంలో పేదలకు అతి తక్కువ ఖర్చుతో రుచికరమైన భోజనం అందించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లకు విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని విరాళం అందించిన దత్త శివను అభినందించి శాలువాతో సత్కరించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నా ఆకాంక్ష.. గణేష్ ఘాట్

◆ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

◆11న వినాయక విగ్రహాల సామూహిక నిమజ్జనానికి సిద్ధంకండి



నెల్లూరు, చైతన్యరథం: తెలంగాణ రాజధాని హైదరాబాదు తరహాలో నెల్లూరు నగరంలో కూడా ఒకేరోజు వినాయక విగ్రహాలను సామూహిక నిమజ్జనం చేద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గణేష్ ఘాట్‌లో జరుగుతున్న పనులను బుధవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజ, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయకచవితి ఉత్సవాలకు ప్రతిఒక్కరు అనుమతులు తీసుకోవాల్సిందేనని అన్నారు. ఒక్క నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గం నుంచి కాకుండా కోవూరు, సర్వేపల్లి ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు విచ్చేసి గణేష్ ఘాట్‌లో నెల్లూరు చెరువులో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి పాదాల చెంత ఈ గణేష్ నిమజ్జనాన్ని కన్నుల పండుగగా నిర్వహిద్దామని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితుడికి టీడీపీ నేతల ఆర్థికసాయం



రంపచోడవరం (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం అడ్డతీగల మండలం ఏపీఆర్ స్కూల్ సమీపంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో స్థానికుడు మిరియాల నాగరాజు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కట్టుబట్టలతో రోడ్డునపడ్డ బాధితుడి కుటుంబాన్ని స్థానిక మండల పార్టీ అధ్యక్షులు జర్త వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పరామర్శించి ధైర్యం చెప్పారు. తక్షణ సాయం కింద 100 కేజీల బియ్యం, కూరగాయాలు, నిత్యవసరాల వస్తువులు, రూ.4 వేల ఆర్థిక సాయం చేశారు. రాబోయే రోజుల్లో బాధిత కుటుంబానికి పక్కా ఇంటి నిర్మాణం చేపట్టి అందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వంక సతీష్, సీనియర్ నాయకులు జుజ్జువారపు శ్రీనివాస్ చౌదరి ,తెలుగు యువత అధ్యక్షులు చదువు రామకృష్ణ, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎర్రం శెట్టి రత్నకుమారి, స్టేట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తోకల సత్తిబాబు, మరియు నాయకులు అట్ట శ్రీను,టేకుమూరు చిన్న నాగేశ్వరరావు, సత్తి సత్తిరెడ్డి,కాదా ఏసుపాదం, సియాధులు సత్యనారాయణ, పల్లాల రాజారెడ్డి, ఐచ్చల రాధాకృష్ణ, కత్రు రాఘవ, మారిశెట్టి భద్ర రావు, స్టూడియో రాజు, మరియు జనసేన నాయకులు రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు తాటికొండ రాజేంద్ర, వద్ది గంగా నాగేశ్వరరావు,ముత్యాల సురేష్, రవి,అంజి, పి రాజు, గోపి, మొదలగు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి

◆ఎమ్మెల్యే గద్దె రామమోహన్ భరోసా

విజయవాడ, చైతన్యరథం: బెంజిసర్కిల్ ట్రెండ్ సెట్ మాల్ ఆటో స్టాండ్ వద్ద ఫ్లైఓవర్ కింద చిరువ్యాపారం చేసుకునే వీధి వ్యాపారుల సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. బుధవారం బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ కింద కార్పొరేషన్ వారు చిరువ్యాపారుల తోపుడుబళ్ళు, బడ్డీకొట్లు తీసివేయించిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే గద్దె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ అధికారులు బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ కింద ఉన్న బడ్డీకొట్లు, తోపుడుబళ్ళు, టిఫిన్ బళ్ళను తొలగించారన్నారు. ఈ చిరువ్యాపారులంతా పేదవారని, వారికి ఈ వ్యాపారాలు తప్ప మరో జీవనోపాధి మార్గాలు లేవన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఆటో కార్మికుల స్టాండ్ కూడా కొనసాగించాలని అధికారులను కోరి ఆటో కార్మికులకు కూడా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆటో కార్మికులు, చిరువ్యాపారులు వారి పనులు నిర్వహించుకునేలా, తాను కమిషనర్‌ను కలిసి వివరించి చిరువ్యాపారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, గద్దె రమేష్, ఆటో యూనియన్ కార్మికులు ఉన్నారు.



# వ్యాధిగ్రస్తుడికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరామర్శ

●వైద్యం కోసం ఎల్ఓసి పత్రం అందజేత

జగ్గయ్యపేట, చైతన్యరథం: వత్సవాయి మండలం, పోలంపల్లి గ్రామానికి చెందిన తుంగ నాగేశ్వరరావు కుమారుడు తుంగా మహేష్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక పరిస్థితి బాగోలేక బాధపడుతూ ఉంటే ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించిన తాతయ్య పోలంపల్లి గ్రామంలో బాధితుడు తుంగా మహేష్ గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వైద్యం కోసం 4 లక్షల 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎల్ఓసి పత్రాన్ని తీసుకువచ్చి బుధవారం మహేష్ కుటుంబ సభ్యులకు స్థానిక నేతలతో కలిసి తాతయ్య అందజేశారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



# బసవపున్నయ్య స్టేడియం అభివృద్ధికి సమష్టిగా కృషి

**◆ఎమ్మెల్యే బొండాతో కలిసి స్టేడియంను పరిశీలించిన ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): యువత క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకునే విధంగా మాకినేని బసవపున్నయ్య నగర పాలక సంస్థ స్టేడియాన్ని స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి సమిష్టిగా అభివృద్ధి చేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. బుధవారం అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య నగర పాలక సంస్థ స్టేడియాన్ని ఎంపి కేశినేని శివనాథ్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వర్షం పడినప్పుడు స్టేడియంలో గ్రౌండ్‌లో నీళ్లు నిలిచిపోతున్న విషయాన్ని పలువురు క్రీడాకారులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్టేడియంలో క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలుగా గ్రౌండ్ ను సిద్ధం చేయాలని, అవసరమైన మేర మేరక పోసి చదును చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ఒత్తిడిని తగ్గించి కొత్త ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. నగర ప్రజలకు అందుబాటులో ఉండేలా స్టేడియాన్ని సిద్ధం చేస్తామని శివనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, 61వ డివిజన్ ప్రెసిడెంట్ దాసరి దుర్గారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నవనీతం సాంబశివరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి బెజ్జం జైపాల్, మైనార్టీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి భాషా తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

**◆ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతి**



శృంగవరపుకోట, చైతన్యరథం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం లక్కవరపుకోట లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్లు శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా వీఆర్‌ఏల ప్రధాన కార్యదర్శి గట్టు వెంకన్న తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో సుమారు 100 మంది వీఆర్‌ఏలు రెవిన్యూ వ్యవస్థలో కింద స్థాయి ఉద్యోగులుగా పని చేస్తున్నారని తెలిపారు. వీరంతా చాలీ,చాలని జీతాలతో కడు దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారని అన్నారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని గతంలో వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదు సరికదా వీఆర్‌ఏలను మోసం చేసారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిసిఎల్‌ఏ గతంలో ఇచ్చిన రూల్స్‌కు విరుద్ధంగా ప్రస్తుత సిసిఎల్‌ఏ ఆఫీస్ నుండి రాత్రి పూట వీఆర్‌ఏ లు నైట్ డ్యూటీలు చెయ్యాలని మెమో.నెం.(02-30222/1/256-1/2024) జారీ చేయడం దురదృష్టకరమని తక్షణమే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్లు, వీఆర్‌ఏ తదితర పోస్టుల్లో అర్హులైన వీఆర్‌ఏలను నియమించడం ద్వారా ప్రమోషన్లు కల్పించి వారికి న్యాయం చెయ్యాలని కోరారు. వీఆర్ఏల కుటుంబాలను ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలో కూడా వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐదు మండలాల వీఆర్‌ఏలు, తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెప్టెంబర్‌లోనే ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

**◆నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఇర్లపాడు వద్ద నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయాన్ని ఈ సెప్టెంబర్‌లోనే ప్రారంభించనున్నట్లు మాజీ మంత్రి, చిలకలూరి పేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన ఉన్నతవిద్యను అందించాలన్న సంకల్పంతోనే వడివడిగా వీటిని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం ఇర్లపాడు వద్ద కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. భవనంలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, ఇతర నిర్మాణ పనులు పరిశీలించారు. చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంలో విశాలమైన ప్రాంగణంలో నూతన భవనం, ఇతర నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇందులో 49 తరగతి గదులు ఉన్నాయి. పనుల పురోగతిపై అధికారులు, గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడిన... ఆయన ఇప్పటికే చిలకలూరిపేట నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపామని, కేంద్రీయ విద్యాలయం రాకతో మరో మెట్టు పైకి వెళ్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రీయ విద్యాలయాలు దేశ ఉన్నత విద్యారంగంలోనే ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి..విద్యార్థులను విభిన్న అంశాల్లో తీర్చిదిద్దే వేదికలుగా నిలుస్తున్నాయన్నారు. ఇక్కడ ప్రయోగాత్మక పద్ధతితో గుణాత్మక విద్య అందిస్తారని అన్నారు. ఇప్పుడు చిలకలూరిపేట నియోజకవర్గంలో అలాంటి ఉన్నత విద్యా సంస్థ అందుబాటులోకి రావడం ద్వారా చదువుకునే పేద విద్యార్థులు, రైతులు, రైతు కూలీల పిల్లలతో పాటు పేద వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాల నుంచి వచ్చేటువంటి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, తాను మంత్రిగా ఉన్నప్పుడు ఈ కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించామన్నారు. నర్సరీ నుంచి ఇంటర్ వరకు కేంద్రీయ విద్యాలయంలో 49 గదులు, అన్ని వసతులతో కూడిన భవనాన్ని నిర్మిస్తున్నారని అన్నారు. కెమిస్ట్రీ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, అన్నీ కూడా బ్రహ్మాండమైన వసతులతో ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన భవనాల కన్నా నెంబర్ వన్‌గా ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు మిన్నగా కేంద్రీయ విద్యాలయ భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ప్లే గ్రౌండ్ కోసం చాలా పెద్దగా ఉందని, ఇక్కడే సిబ్బంది క్వార్టర్స్ కూడా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు సహా ఇక్కడ పనిచేసే అందరూ రాత్రి క్వార్టర్స్‌లో ఉండొచ్చన్నారు. ఆనాడు గణపవరంలో తాత్కాలికంగా తరగతులు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. మొత్తం 16 ఎకరాల్లో భవన నిర్మాణం జరుగుతుందని, అందులో 10.11 ఎకరాలను ఇర్లపాడుకు చెందిన రైతులు కేంద్రీయ విద్యాలయం కోసం త్యాగం చేశారన్నారు. ఈ నియోజకవర్గంలో చదువుకుంటున్న అన్ని వర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచి వాతావరణంలో పిల్లలు చదువుకునే అవకాశాన్ని చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఢిల్లీలో మోదీ ఉన్నప్పుడు, ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలు ఉన్నప్పుడే ఈ భవనాన్ని ప్రారంభించ బోతున్నామని చెప్పారు.

# అభివృద్ధికి కేరాఫ్‌గా పేటను మారుస్తా

**◆నియోజకవర్గమంతా చురుగ్గా అభివృద్ధి పనులు**

**◆శ్మశానవాటికలను సైతం సుందరంగా మారుస్తాం**

**◆నరసరావుపేటను క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుస్తానని ఎమ్మెల్యే హామీ**



నరసరావుపేట (చైతన్యరథం): నరసరావుపేట నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా మార్చి చూపించి తీరుతానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. దగ్గరుండి పనులు చేయించారు. ప్రధానంగా గత పాలకులు శ్మశాన వాటికల అభివృద్ధినిసైతం గాలికి వదిలేశారని, వాటిని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గతంలో కోడెల శివప్రసాదరావు ఉన్నపుడు ఎంత సుందరంగా ఉండేదో అంతకు మించి శుభ్రంగా తయారుచేసి కోడెలకు అంకితం ఇస్తానన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసిందని, సంక్షేమాన్ని నాశనం చేసిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అన్ని పార్టీల నాయకులు కూడా సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే చదలవాడ అన్నారు.



# వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**◆ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన భూపేష్‌రెడ్డి**

జమ్మలమడుగు (చైతన్యరథం): టీడీపీ యాప్‌లో యాక్టివ్‌గా ఉంటూ పార్టీ కార్యక్రమాలను కార్యకర్తలకు, నాయకులకు ఎప్పటికప్పుడు అందజేస్తున్న నియోజకవర్గానికి చెందిన 30 మంది తెలుగుదేశంపార్టీ నాయకులకు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపించిన ప్రశంసా పత్రాలను నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టి తెలుగు ప్రజలను ప్రపంచంలోనే ఉత్తమ స్థానంలో చూడటమే మన తెలుగుదేశం పార్టీ సంకల్పమన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, కూటమి ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ అబద్ధ ప్రచారాలు తిప్పి కొట్టి ప్రజలకు వాస్తవాలను తెలియజేయడంలో మీరు నిరంతరం కృషి చేయాలని కోరారు.

# కూనపరాజుపర్వ అభివృద్ధికి కృషి

**❑ఇప్పటికే గ్రామాభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరు**

**❑కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన**

**❑వంద రోజుల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేస్తాం**

**❑ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వెల్లడి**



మైలవరం (చైతన్యరథం): రెడ్డిగూడెం మండలం కూనప రాజుపర్వ గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల, ప్రజల బహిరంగ ప్రజా ప్రయోజనాల కోసం ఇక్కడ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. వంద రోజుల్లో కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మొదటిగా దివంగత నేత అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... కూనపరాజుపర్వ గ్రామాభివృద్ధికి ఇప్పటికే రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కూనపరాజుపర్వ గ్రామంలో విద్యుత్తు సమస్య, వివిధ సామాజిక వర్గాల స్మశాన వాటిక స్థలాల కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తెలియజేస్తామన్నారు. దశలవారీగా రహదారుల నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో ఏపీ సమగ్రాభివృద్ధి సాధ్యమని, వందరోజుల ప్రణాళికలతో గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన శాఖల్ని పునరుద్ధరిస్తున్నారన్నారు. ముఖ్యంగా చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని పేర్కొన్నారు. అప్పుల ఊబిలో కూరుకున్న రాష్ట్రానికి సంపద సృష్టించే దిశగా అడుగులు వేస్తున్నారని, తాజాగా విడుదల చేసిన 15వ ఆర్థికసంఘం నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కేంద్ర నిధుల సద్వినియోగంతో ఇంటింటికీ నీటికుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు ఇస్తామన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని వసంత కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు.